# ప్రజాస్వరం

PRAJASWARAM

తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 19 సంచిక : 150 | సోమవారం 02, ఫిబ్రవరి 2026 | పేజీలు: 09 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com


## తెలంగాణకు కేంద్ర బడ్జెట్ లో మొండిచేయి..
# మేం చేసిన తప్పేంటి..?

బడ్జెట్‌లో తెలంగాణకు కీలక ప్రాజెక్టులకు నో ఫండ్స్

మూసీ, RRR, మెట్రో విస్తరణకు కేంద్రం నిర్లక్ష్యం

కెమికల్ పార్క్, మెడికల్ హబ్ జాబితాలో రాష్ట్రానికి చోటు లేదు

"తెలంగాణ ఏం తప్పు చేసింది?" అంటూ భట్టి ఆగ్రహం



హైదరాబాద్, (ప్రజాస్వరం):

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మండిపడ్డారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి తామంతా ఢిల్లీ వెళ్లి ప్రధానిని, కేంద్ర ఆర్థిక మంత్రిని పలుమార్లు కలిసి విన్నవించినప్పటికీ, ఒక్క విన్నపాన్ని కూడా ..మిగతా 2లో

## సిట్‌కు కొత్త అర్థం చెప్పిన హరీశ్ రావు

ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏర్పాటైన సిట్ ఒక "సీఎం ఇన్‌స్ట్రక్షన్ టీమ్" అన్న హరీశ్

కేసీఆర్‌కు ఇచ్చిన నోటీసులు రాజకీయ కక్షసాధింపు చర్యలేనని ఆగ్రహం

పాలనలోని వైఫల్యాల నుంచి దృష్టి మళ్లించేందుకే ఈ డ్రామా అంటూ విమర్శలు

చట్టబద్ధం కాకపోయినా కేసీఆర్ దర్యాప్తునకు సహకరిస్తున్నారని వెల్లడి


03

## పసలేని పద్దు

నిరుద్యోగం, రైతుల కష్టాలను ప్రభుత్వం విస్మరించిందని రాహుల్ ఆరోపణ

స్టాక్ మార్కెట్ పతనానికి బడ్జెట్టే కారణమన్న అఖిలేశ్ యాదవ్

ఇది కేవలం 5 శాతం మంది ప్రజల కోసమేనని విమర్శ

మధ్యతరగతి, రైతులు, కార్మికులకు తీవ్ర నిరాశే మిగిలిందని వ్యాఖ్య


02

## 12వ బడ్జెట్ లోనూ తెలంగాణ కు
# గుండు సున్నానే

8 మంది బీజేపీ ఎంపీలను గెలిపించినా తెలంగాణకు తీరని అన్యాయం

ఏళ్లుగా తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్న బీజేపీ సర్కార్

కేంద్ర బడ్జెట్ పై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత.



03

## రూ.53.5 లక్షల కోట్లతో బడ్జెట్



వరుసగా తొమ్మిదోసారి ప్రవేశపెట్టిన నిర్మలా సీతారామన్

మూలధన వ్యయం రూ.12.2 లక్షల కోట్లకు పెంపు

ద్రవ్యలోటు జీడీపీలో 4.3 శాతానికి పరిమితం

7 హైస్పీడ్ రైల్ కారిడార్లు..

హైదరాబాద్‌ను కలిపే 3 మార్గాలు

బయోఫార్మా, ఎంఎస్ఎంఈ రంగాలకు చెరో రూ.10,000 కోట్ల నిధులు

భారత్‌ను గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యం

దిగుమతులపై కస్టమ్స్ సుంకం 10 శాతానికి తగ్గింపు

ఏప్రిల్ నుంచి అమల్లోకి కొత్త ఆదాయపు పన్ను చట్టం

సెమీకండక్టర్ మిషన్‌కు రూ.40,000 కోట్లు


రేర్ ఎర్త్ కారిడార్లు, జలమార్గాలు

గ్రీన్ టెక్నాలజీలతో దీర్ఘకాలిక వృద్ధిపై ఫోకస్



హైదరాబాద్, (ప్రజాస్వరం):

కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ 202627 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పూర్తి స్థాయి బడ్జెట్‌ను ఆదివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. యువశక్తిని చోదకశక్తిగా చేసుకుని, పేదలు, అణగారిన వర్గాల ప్రగతి లక్ష్యంగా ఈ బడ్జెట్‌ను రూపొందించినట్లు ఆమె తెలిపారు. 75 ఏళ్ల సంప్రదాయాన్ని మారుస్తూ.. ఈసారి ఆదివారం నాడు బడ్జెట్ ప్రసంగం ..మిగతా 2లో



# ఆ పెద్దాయన... మీరేనా...?

## ఫోన్ ట్యాపింగ్ లో మీ ప్రమేయం ఎంత

అలా చేయమని ఆదేశాలు మీరే ఇచ్చారా..?

ఫోన్ ట్యాపింగ్ కేసులో ముగిసిన కేసీఆర్ విచారణ

కేసీఆర్‌ను నాలుగున్నర గంటలపాటు ప్రశ్నించిన సిట్.

కేసీఆర్ ను ప్రశ్నించిన ఆరుగురు సభ్యుల సిట్ బృందం

సాక్ష్యాలు, స్టేట్‌మెంట్లపై వివరణ నమోదు

విచారణలో భావోద్వేగానికిలోనైన మాజీ సీఎం

బీఆర్ఎస్ ఆందోళనలతో అట్టుడికిన హైదరాబాద్




హైదరాబాద్, (ప్రజాస్వరం):

ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ సీఎం కేసీఆర్ సిట్ విచారణ ముగిసింది. హైదరాబాద్ లోని నంది నగర్ లో ఉన్న నివాసంలో రెండవ అంతస్తులోని ఓ గదిలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు సిట్ విచారణ ప్రారంభమవ్వగా.. నాలుగు గంటల 50 నిమిషాలపాటు సిట్ అధికారులు కేసీఆర్ ను విచారించారు. ఈ కేసులో ఇప్పటికే పలువురు అధికారులతో పాటు బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నేతలు, కేసీఆర్ కుటుంబ సభ్యులైన కేటీఆర్, హరీశ్ రావు, సంతోశ్ రావును సిట్ ప్రశ్నించింది. ఏసీపీ స్థాయి అధికారులతో కూడిన ఆరుగురు సభ్యుల సిట్ బృందం ఈ విచారణలో పాల్గొనగా ప్రశ్నలు అడగడంతో పాటు ఇప్పటికే ఈ కేసులో అరెస్టయిన, విచారణ ఎదుర్కొన్న అధికారులు, పార్టీ నేతలు ఇచ్చిన స్టేట్‌మెంట్లను కేసీఆర్ ముందు ఉంచి వివరణ కోరినట్లు సమాచారం. వీరిలో ఏడుగురు పోలీస్ అధికారులు ఇచ్చిన సమాచారంతోనే కేసీఆర్‌ను ప్రశ్నించారు. ముఖ్యంగా ఫోన్ ట్యాపింగ్ ఆదేశాల వెనుక ఉన్నది ఎవరు? ప్రభాకర్ రావు నియామకం విషయంలో మీ పాత్ర ఏంటి అనే అంశాలపై సిట్ ప్రశ్నల వర్షం కురిపించింది. 'పెద్దాయన' ..మిగతా 3లో

## బాబు హుషార్..
# రేవంత్ జీహుజూర్..

నీటివాటాల పునఃపంపిణీపై ఏపీ ఆది నుంచీ అక్కసు

పోటీగా గోదావరి ట్రిబ్యునల్ తెచ్చేందుకు కుట్రలు

ఆ దిశగా వడివడిగా అడుగులు.. చర్చల పేరిట వ్యూహాలు

ఏపీకే వంతపాడుతున్న కేంద్ర ప్రభుత్వం

సోయిలేకుండా రేవంత్‌రెడ్డి సర్కార్ పరుగులు



హైదరాబాద్, (ప్రజాస్వరం):

కృష్ణా, గోదావరి నదీజలాల వాటాను కొల్లగొట్టేందుకు ఏపీ సీఎం చంద్రబాబు ఎత్తుల మీద ఎత్తులు వేస్తున్నారు. సుదీర్ఘకాలం పోరాడి కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ సర్కార్ సాధించిన సెక్షన్3 మార్గదర్శకాలను ఒప్పుకొనే ప్రసక్తే లేదని ఏపీ తెగేసి చెప్తూ అడుగడుగునా అడ్డుపడుతున్నది. బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపులనూ ఒప్పుకోబోమని వాదిస్తున్నది. తెలంగాణ ప్రాజెక్టులమిగతా 3లో

## ఎస్ఎల్‌బీసీపై నిర్లక్ష్యం చేస్తే
# సహించం

నిరంతరం పనుల సమీక్ష పై రూట్ మ్యాప్

భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి

ప్రభుత్వం చేతికి హెలి-బోర్న్ సర్వే నివేదిక

నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్, (ప్రజాస్వరం):

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్.ఎల్.బి.సి నిర్మాణం పనుల్లో జాప్యాన్ని ఉపేక్షించేది లేదని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. సొరంగం మార్గం పనులను నిరంతరం కొనసాగించి త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామన్నారు. సొరంగ నిర్మాణ పనులలో ప్రమాదాలు పునరావృతం కాకుండా ఉండేందుకు భద్రతా చర్యలపై ప్రత్యేక దృష్టి ..మిగతా 3లో

## సౌమ్య కుటుంబానికి కోటి రూపాయల సాయం.!

గంజాయి ముఠాతో పోరాడి వీరమరణం

సోదరుడికి సర్కార్ ఉద్యోగం.!

వాహనంతో ఢీకొట్టి పరారైన నిందితులు

నిమ్స్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస

కుటుంబానికి రూ.1 కోటి సాయం, సోదరుడికి ఉద్యోగం

హైదరాబాద్, (ప్రజాస్వరం):

విధి నిర్వహణలో గంజాయి మాఫియా పాలిట సింహస్వప్నంగా మారి, వీరమరణం పొందిన ఎక్సైజ్ కానిస్టేబుల్ గాజుల సౌమ్య (26) సాహసం యావత్ రాష్ట్రాన్ని కన్నీరు పెట్టించింది. ప్రాణాలకు తెగించి గంజాయి ముఠాను అడ్డుకున్న ఆమె మృతి పట్ల ప్రభుత్వం ..మిగతా 3లో



## మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా
# మారడమే లక్ష్యం..

నిర్మలమ్మ బడ్జెట్‌పై మోడీ ప్రశంసలు


వరల్డ్‌లో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారడమే లక్ష్యం

పౌరులను శక్తివంతం చేస్తుందని వ్యాఖ్య

భారత గమనానికి సరికొత్త శక్తి

ఆత్మ నిర్భర్ భారత్‌కు కొత్త ఊపు

ఈ బడ్జెట్ ఒక ప్రతిష్ఠాత్మకమైన రోడ్‌మ్యాప్



హైదరాబాద్, (ప్రజాస్వరం):

పార్లమెంట్ లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ప్రధాని మోడీ విమర్శలు ప్రశంసలు కురిపించారు. భారతదేశం అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా మారడమే లక్ష్యం కాదని.. ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించడమే లక్ష్యం అని ప్రధాని మోడీ అన్నారు.

ఈ బడ్జెట్ అంతా మానవ కేంద్రీకృతమైందని.. విప్లవాత్మక సంస్కరణలతో భారతదేశం పునాదిని బలోపేతం చేస్తుందన్నారు. చారిత్రాత్మకమైన బడ్జెట్‌గా అభివర్ణించారు. దీర్ఘకాలిక వృద్ధిని వేగవంతం చేయడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. బడ్జెట్‌లోని ప్రతిపాదనలు ఆర్థిక వ్యవస్థను ఉత్తేజపరుస్తాయని.. అంతేకాకుండా పౌరులను శక్తివంతం చేస్తాయన్నారు. భారతదేశ యువత కొత్త శిఖరాలను అధిరోహించడానికి కొత్త అవకాశాలను ఇస్తాయని ..మిగతా 3లో

## తెలంగాణకు కేంద్ర బడ్జెట్ లో మొండిచేయి..
# మేం చేసిన తప్పేంటి.?

**మొదటిపేజీ తరువాయి**



కేంద్రం పరిగణనలోకి తీసుకోకపోవడం దారుణమని ఆయన ధ్వజమెత్తారు. "తెలంగాణ ఏం తప్పు చేసింది?" అని ప్రశ్నిస్తూ, కేంద్రం వివక్షాపూరిత వైఖరిపై ఆయన నిప్పులు చెరిగారు.

రాష్ట్ర భవిష్యత్తుకు కీలకమైన రీజినల్ రింగ్ రోడ్ (RRR), మెట్రో విస్తరణ, , మూసీ ప్రక్షాళన ప్రాజెక్టుల కోసం కేంద్రం నుండి భారీగా నిధులు అందుతాయని ఆశించామని భట్టి పేర్కొన్నారు. మూసీ పునరుజ్జీవం కోసం కేంద్ర సాయం కోరినప్పటికీ బడ్జెట్ లో దాని ఊసే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ ప్రపంచానికే ఫార్మా హబ్‌గా ఉన్నప్పటికీ, కేంద్రం ప్రకటించిన కెమికల్ పార్కుల జాబితాలో తెలంగాణకు చోటు కల్పించకపోవడంపై ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. గతంలో కాంగ్రెస్ హయాంలో ECIL వంటి దిగ్గజ సంస్థలను హైదరాబాద్‌కు తెచ్చామని, కానీ ప్రస్తుత ప్రభుత్వం ఉన్నవాటిని కూడా పట్టించుకోవడం లేదని విమర్శించారు.

తెలంగాణ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రతిష్ఠాత్మకంగా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసిందని, అయితే కేంద్రం స్పోర్ట్స్ విభాగంలోనూ రాష్ట్రానికి మొండిచేయి చూపిందని భట్టి విమర్శించారు. అఫోర్డబుల్ స్పోర్ట్స్ గూడ్స్ గురించి విజన్ డాక్యుమెంట్ లో తెలంగాణ గురించి ప్రముఖంగా చెప్పినా, బడ్జెట్ కేటాయింపుల్లో అది ఎక్కడా కనిపించలేదన్నారు. హైదరాబాద్ సెంట్రిక్‌గా ఉండాల్సిన 'ఆరెంజ్ ఎకానమీ'ని కూడా బాంబేకి తరలించడం రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయానికి పరాకాష్ట అని ఆయన పేర్కొన్నారు. రామప్ప వంటి ప్రపంచ వారసత్వ కట్టడాలు, కృష్ణాగోదావరి నదుల తీరంలో అద్భుతమైన దేవాలయాలు, అటవీ సంపద ఉన్నా తెలంగాణ టూరిజాన్ని కేంద్రం పూర్తిగా విస్మరించిందని భట్టి ఆరోపించారు. రీజినల్ మెడికల్ హబ్ ప్రకటించినా అందులో తెలంగాణ పేరు లేదని, సెమీ కండక్టర్ల విషయంలో కేవలం 'పరిశీలిస్తాం' అన్న మాటే తప్ప స్పష్టమైన ప్రకటన లేదని మండిపడ్డారు.

కేంద్రం 2047 లక్ష్య సాధనలో తాము కూడా భాగస్వామ్యం కావాలని అనుకున్నామని, కానీ కేంద్రం తెలంగాణను నిర్లక్ష్యం చేయడం వల్ల అది సాధ్యం కాదని ఆయన అన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని జాబితా నుండి తొలగించే ప్రయత్నం చేస్తూ, పేదల సంక్షేమానికి కేంద్రం తూట్లు పొడుస్తోందని విమర్శించారు. "రాష్ట్ర అభివృద్ధి కోసం పార్టీలకు అతీతంగా ఎంపీలందరూ కలిసి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి. మేము బాధ్యతగా కేంద్రాన్ని కలుస్తూనే ఉంటాం, కానీ రాష్ట్ర ప్రయోజనాల కోసం రాజకీయాలకు అతీతంగా పోరాటం చేస్తాం" అని భట్టి విక్ర

# పసలేని పద్దు

* నిరుద్యోగం, రైతుల కష్టాలను ప్రభుత్వం విస్మరించిందని రాహుల్ ఆరోపణ
* స్టాక్ మార్కెట్ పతనానికి బడ్జెట్టే కారణమన్న అఖిలేశ్ యాదవ్
* ఇది కేవలం 5 శాతం మంది ప్రజల కోసమేనని విమర్శ
* మధ్యతరగతి, రైతులు, కార్మికులకు తీవ్ర నిరాశే మిగిలిందని వ్యాఖ్య



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 202627 బడ్జెట్‌పై విపక్షాలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డాయి. దేశం ఎదుర్కొంటున్న వాస్తవ ఆర్థిక, సామాజిక సవాళ్లను ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. నిరుద్యోగం, తయారీ రంగం క్షీణత, రైతుల కష్టాలు వంటి కీలక సమస్యలను పరిష్కరించడంలో ఈ బడ్జెట్ ఘోరంగా విఫలమైందని ఆయన ఆదివారం విమర్శించారు.

ఈ మేరకు 'ఎక్స్' వేదికగా రాహుల్ గాంధీ స్పందించారు. "ఉద్యోగాలు లేని యువత, పడిపోతున్న తయారీ రంగం, దేశం నుంచి తరలిపోతున్న పెట్టుబడులు, కుప్పకూలుతున్న కుటుంబ పొదుపు, రైతుల కష్టాలు, పొంచివున్న ప్రపంచ ఆర్థిక సంక్షోభాలు... వీటన్నింటినీ బడ్జెట్ పట్టించుకోలేదు. దిద్దుబాటు చర్యలకు నిరాకరిస్తున్న ఈ బడ్జెట్, భారతదేశ వాస్తవ సంక్షోభాల పట్ల గుడ్డిగా వ్యవహరిస్తోంది" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. రాహుల్‌తో పాటు ఇతర విపక్ష నేతలు కూడా బడ్జెట్‌పై పెదవివిరిచారు. వృద్ధిని పునరుద్ధరించడానికి, ఉపాధి కల్పించడానికి ఇందులో సరైన సంస్కరణలు లేవని విమర్శించారు.

సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ మరో అడుగు ముందుకేసి, స్టాక్ మార్కెట్ పతనానికి బడ్జెట్టే కారణమని ఆరోపించారు. "బీజేపీ బడ్జెట్ ఫలితం ఇదిగో.. షేర్ మార్కెట్ భారీగా కుప్పకూలింది. ఆదివారం మార్కెట్ తెరుస్తారా లేదా అన్నది ప్రశ్న కాదు, అది ఇంకా ఎంత పడిపోతుందన్నదే అసలు ప్రశ్న అని మేము ముందే చెప్పాం" అని ఆయన అన్నారు. ఈ బడ్జెట్ కేవలం 5 శాతం మంది ప్రజల కోసమేనని, కమీషన్లు దక్కించుకోవడానికి, బీజేపీ సొంత వ్యక్తులకు ప్రయోజనం చేకూర్చడానికే దీన్ని రూపొందించారని ఆయన తీవ్రంగా ఆరోపించారు. "ఇది బీజేపీ తరహా అవినీతికి కంటికి కనిపించని లెక్కల చిట్టా" అని అఖిలేష్ అభివర్ణించారు.

అనియంత్రితంగా పెరుగుతున్న ద్రవ్యోల్బణం సమయంలో పన్ను ఉపశమనం కల్పించకపోవడం 'పన్ను దోపిడీ' కిందకే వస్తుందని ఆయన విమర్శించారు. సంపన్నులకు వ్యాపారం, ప్రయాణాల కోసం పదుల రకాల మినహాయింపులు ఇచ్చి, నిరుద్యోగులకు మాత్రం 'ఆశల ఖాళీ పళ్లెం' చూపించారని ఎద్దేవా చేశారు. ఈ బడ్జెట్ వల్ల మధ్యతరగతి ప్రజలు పూర్తిగా మోసపోయినట్లు భావిస్తున్నారని, పేదలు మరింతగా కుంగిపోతున్నారని అన్నారు. రైతులు, కార్మికులు, చిరు వ్యాపారులు టెలిస్కోప్‌తో వెతికినా తమ కోసం ఇందులో ఏమీ కనిపించలేదని, ఇది తీవ్ర నిరాశాజనకమైన, దారుణమైన బడ్జెట్ అని అఖిలేష్ యాదవ్ వ్యాఖ్యానించారు.

బడ్జెట్‌పై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఇది విజన్, మిషన్, దిశానిర్దేశం లేని బడ్జెట్ అని, పూర్తిగా అబద్ధాలతో నిండి ఉందని ఆమె అభివర్ణించారు. ఢిల్లీ పర్యటనకు బయలుదేరే ముందు కోల్‌కతా విమానాశ్రయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ బడ్జెట్ ద్వారా కేంద్రం దేశ ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేస్తోందని ఆరోపించారు.

"ఈ బడ్జెట్‌కు ఎలాంటి లక్ష్యం లేదు. ఇది పూర్తిగా పేదలు, మహిళలు, రైతులు, యువత, సామాన్యులతో పాటు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు వ్యతిరేకమైనది. విద్యా రంగానికి కేటాయింపులు లేవు. విద్యా సబ్సిడీ, సామాజిక భద్రతా సబ్సిడీ, ఎరువుల సబ్సిడీలను తగ్గించారు. ఇది పూర్తిగా అబద్ధాల కుప్ప" అని మమత తీవ్రంగా విమర్శించారు.

పశ్చిమ బెంగాల్‌కు కేంద్రం ఒక్క పైసా కూడా కేటాయించలేదని ఆమె ఆరోపించారు. "మా రాష్ట్రానికి నిధులు ఇవ్వలేదు. జీఎస్టీ రూపంలో మా డబ్బును వారే తీసుకెళ్లి, తిరిగి మేమే ఇస్తున్నట్టు గొప్పలు చెబుతున్నారు. ప్రభుత్వాన్ని నడిపే నైతిక హక్కు వారికి లేదు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు

# రూ.53.5 లక్షల కోట్లతో బడ్జెట్

**మొదటిపేజీ తరువాయి**

జరిగింది. మొత్తం రూ.53.5 లక్షల కోట్ల వ్యయంతో ప్రతిపాదించిన ఈ బడ్జెట్‌లో స్థిరమైన ఆర్థిక వృద్ధి, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం, 'సబ్ కా సాత్, సబ్ కా వికాస్' దార్శనికతతో అందరికీ సమాన అవకాశాలు కల్పించడం అనే మూడు ప్రధాన కర్తవ్యాలకు ప్రాధాన్యత ఇచ్చారు.

**ప్రధాన కేటాయింపులు, ఆర్థిక అంచనాలు**

202627 ఆర్థిక సంవత్సరంలో మొత్తం వ్యయం రూ.53.5 లక్షల కోట్లుగా అంచనా వేయగా, మొత్తం రాబడులు (అప్పులు మినహా) రూ.36.5 లక్షల కోట్లుగా ఉంటాయని బడ్జెట్‌లో పేర్కొన్నారు. కేంద్ర నికర పన్ను రాబడులు రూ.28.7 లక్షల కోట్లుగా అంచనా వేశారు. ద్రవ్యలోటును జీడీపీలో 4.3 శాతానికి పరిమితం చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. 202526 సవరించిన అంచనాల్లో ద్రవ్యలోటు 4.4 శాతంగా ఉంది. స్థూల మార్కెట్ రుణాలు రూ.17.2 లక్షల కోట్లుగా ఉంటాయని తెలిపారు.

**మౌలిక సదుపాయాలకు భారీ కేటాయింపులు**

దేశంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో పెద్ద పీట వేసింది. ప్రభుత్వ మూలధన వ్యయాన్ని (పబ్లిక్ క్యాపెక్స్) గత ఏడాది రూ.11.2 లక్షల కోట్ల నుంచి ఈసారి రూ.12.2 లక్షల కోట్లకు పెంచుతున్నట్లు నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఈ భారీ నిధులతో దేశవ్యాప్తంగా పలు కీలక ప్రాజెక్టులకు ఊతం లభించనుంది. ఇందులో భాగంగా పర్యావరణ అనుకూల ప్రయాణ వ్యవస్థలను ప్రోత్సహించేందుకు ఏడు హైస్పీడ్ రైల్ కారిడార్లను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. వీటిలో ముంబైపుణె, పుణెహైదరాబాద్, హైదరాబాద్‌బెంగళూరు, హైదరాబాద్‌చెన్నై, చెన్నైబెంగళూరు కారిడార్లు ఉన్నాయి. దీంతో పాటు తూర్పున దంకుని నుంచి పశ్చిమాన సూరత్ వరకు కొత్త ప్రత్యేక సరుకు రవాణా కారిడార్లను ఏర్పాటు చేయనున్నారు. రాబోయే ఐదేళ్లలో 20 కొత్త జాతీయ జలమార్గాలను అందుబాటులోకి తీసుకురానున్నారు.

**రంగాల వారీగా నిధుల కేటాయింపు**

ఈ బడ్జెట్‌లో పలు కీలక రంగాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించారు.

బయోఫార్మా: బయోఫార్మా రంగంలో భారత్‌ను గ్లోబల్ హబ్‌గా మార్చే లక్ష్యంతో 'బయోఫార్మా శక్తి' పథకాన్ని ప్రకటించారు. దీనికోసం రాబోయే ఐదేళ్లలో రూ.10,000 కోట్లు కేటాయించారు.

ఎంఎస్ఎంఈ: సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించడానికి రూ.10,000 కోట్లతో 'ఎస్ఎంఈ గ్రోత్ ఫండ్'ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎలక్ట్రానిక్స్: ఎలక్ట్రానిక్ కాంపోనెంట్స్ తయారీ పథకం కోసం కేటాయింపులను రూ.40,000 కోట్లకు పెంచారు. పరిశ్రమలు: కంటైనర్ల తయారీ పరిశ్రమను ప్రోత్సహించేందుకు ఐదేళ్ల కాలానికి రూ.10,000 కోట్లు కేటాయించారు. పర్యావరణం: కార్బన్ క్యాప్చర్, యుటిలైజేషన్ అండ్ స్టోరేజ్ (సీసీయూఎస్) టెక్నాలజీల కోసం రాబోయే ఐదేళ్లలో రూ.20,000 కోట్లు కేటాయించారు. పట్టణాభివృద్ధి: నగర ఆర్థిక ప్రాంతాల (సిటీ ఎకనామిక్ రీజియన్స్) అభివృద్ధి కోసం ఒక్కో ప్రాంతానికి ఐదేళ్లలో రూ.5,000 కోట్లు కేటాయించనున్నారు.

**పన్నులు, ఇతర ప్రతిపాదనలు**

పన్ను చెల్లింపుదారులకు సౌలభ్యం కల్పించేందుకు పలు సంస్కరణలు ప్రతిపాదించారు. ఏప్రిల్ 2026 నుంచి 'కొత్త ఆదాయపు పన్ను చట్టం, 2025' అమల్లోకి రానుంది. విదేశీ పర్యటన ప్యాకేజీలపై టీసీఎస్ రేటును 2 శాతానికి తగ్గించారు. వ్యక్తిగత వినియోగం కోసం దిగుమతి చేసుకునే వస్తువులపై బేసిక్ కస్టమ్స్ సుంకాన్ని 20% నుంచి 10%కి తగ్గించడం ద్వారా సామాన్యులకు ఊరట కల్పించారు.

క్యాన్సర్ చికిత్సకు ఉపయోగించే 17 రకాల మందులపై బేసిక్ కస్టమ్స్ సుంకాన్ని మినహాయించారు. మరోవైపు, ఫ్యూచర్స్ ట్రేడింగ్‌పై సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ఎస్టీటీ)ని 0.02% నుంచి 0.05%కి పెంచారు. మొత్తం మీద ఈ బడ్జెట్, దీర్ఘకాలిక వృద్ధి, ఉపాధి కల్పన లక్ష్యంగా మౌలిక వసతులు, తయారీ రంగాలపై దృష్టి సారించినట్లు స్పష్టమవుతోంది.

పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రసంగంలో నిర్మలా సీతారామన్ ఒక స్పష్టమైన సందేశం ఇచ్చారు. "దేశ సంస్కరణల రైలు ఆగలేదు.. వేగంగా ముందుకెళ్తూనే ఉంది" అని చెప్తుతూ.. కేంద్ర ప్రభుత్వం సంస్కరణలకే మొదటి ప్రాధాన్యం ఇస్తోందని మరోసారి స్పష్టం చేశారు. తొమ్మిదోసారి ఆమె ప్రవేశపెట్టిన బడ్జెట్ 2026ను, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని రూపొందించిన మార్గపటంగా వివరించారు. టెక్నాలజీలో ముందంజ, తయారీ రంగంలో బలం, దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వం ఇవే ఈ బడ్జెట్ లక్ష్యాలుగా చెప్పారు.

ఆగస్టు 15 తర్వాత ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలను ఆర్థిక మంత్రి మొదట గుర్తు చేశారు. జీఎస్టీలో మార్పులు, కొత్త కార్మిక చట్టాలు, నాణ్యత నియంత్రణకు సంబంధించిన కొత్త నిబంధనలు ఇవన్నీ దేశ ఆర్థిక వ్యవస్థను ఆధునికంగా మార్చే దిశలో తీసుకున్న అడుగులని చెప్పారు. ఈ నిర్ణయాల వల్లే భారత్‌లో వృద్ధి కొనసాగుతోందని, ద్రవ్యోల్బణం అదుపులో ఉందని, ఆర్థిక పరిస్థితి స్థిరంగా ఉందని వివరించారు. ప్రజల మేలు కోసం తీసుకున్న నిర్ణయాలే ఈ ఫలితాలకు కారణమని చెబుతూ.. "ప్రజలకే ప్రాధాన్యం, మాటలకన్నా పనికి విలువ" అనే విధానంతోనే ప్రభుత్వం ముందుకు వెళ్తోందని చెప్పారు. ఈ బడ్జెట్‌లో ముఖ్యంగా చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు పెద్ద ఊరట కలిగించే ప్రకటన చేశారు. భవిష్యత్తులో దేశానికి గర్వకారణమైన సంస్థలుగా ఎదిగే సామర్థ్యం ఉన్న ఎస్ఎంఈలను ప్రోత్సహించేందుకు రూ.10 వేల కోట్లతో ప్రత్యేక గ్రోత్ ఫండ్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే దేశీయ తయారీని పెంచేందుకు, దిగుమతులపై ఆధారాన్ని తగ్గించేందుకు మూడు ప్రత్యేక కెమికల్ పార్కులు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఇది పరిశ్రమలకు కొత్త అవకాశాలు తెస్తుందని చెప్పారు.

వ్యూహాత్మకంగా చాలా కీలకమైన ఖనిజాల విషయానికీ బడ్జెట్‌లో చోటు దక్కింది. 2025లో ప్రారంభించిన రేర్ ఎర్త్ మాగ్నెట్ల పథకం తర్వాత, ఇప్పుడు ఒడిశా, కేరళ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో ప్రత్యేక రేర్ ఎర్త్ కారిడార్‌లను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. దీని వల్ల భవిష్యత్తులో హైటెక్ రంగాలు, రక్షణ రంగానికి అవసరమైన ముడి సరుకులు భద్రంగా అందుబాటులోకి వస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. టెక్నాలజీ, కొత్త ఆవిష్కరణలు ఈ బడ్జెట్‌లో ప్రధాన స్థంభాలుగా నిలిచాయి. ఇండియా సెమీ కండక్టర్ మిషన్ 2.0ను ప్రకటిస్తూ, పరిశ్రమల ఆధ్వర్యంలో పరిశోధన, ఆధునిక చిప్ తయారీ కేంద్రాలు, నిపుణుల తయారీకి ప్రత్యేక శిక్షణ కేంద్రాలపై దృష్టి పెడతామని చెప్పారు. చిప్ తయారీ, ఎలక్ట్రానిక్స్, సెన్సర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు సంబంధించిన రంగాల్లో పెట్టుబడులు మరింత పెరుగుతాయని తెలిపారు.

బడ్జెట్‌లో మెరుగైన రైలు సౌకర్యాలకు కేంద్రం ప్రాధాన్యత ఇచ్చింది. ఆదివారం నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో 7 హై స్పీడ్ రైల్ కారిడార్లను ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యంగా హైదరాబాద్‌ను కలిపే మూడు కారిడార్లు ఉండటం గమనార్హం. బడ్జెట్‌లో మెరుగైన రైలు సౌకర్యాలకు కేంద్రం ప్రాధాన్యత ఇచ్చింది. ఆదివారం నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో 7 హై స్పీడ్ రైల్ కారిడార్లను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. హైదరాబాద్ కేంద్రంగా రెండు హై స్పీడ్ రైల్ కారిడార్లు ఉండటం గమనార్హం. ఇందులో ముంబై-పుణే, హైదరాబాద్-బెంగళూరు, ఢిల్లీ-వారణాసి, వారణాసి-సిలిగురి, పుణే-హైదరాబాద్, హైదరాబాద్-చెన్నై, చెన్నై-బెంగళూరు ఉన్నాయి.

వేగవంతమైన, పర్యావరణపరంగా స్థిరమైన ప్రయాణాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో ఏడు కారిడార్లను ఏర్పాటు చేయనున్నట్లు ఆర్థిక మంత్రి ప్రకటించారు. ప్రతిపాదిత కారిడార్లలో ప్రధాన ఆర్థిక, సాంస్కృతిక కేంద్రాల మధ్య కనెక్టివిటీ మెరుగుపడటంతో పాటు, సుదూర ప్రాంతాల మధ్య కాలుష్య రహిత ప్రయాణాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. రాబోయే ఐదేళ్లలో కొత్తగా 22 జాతీయ జలమార్గాల నిర్వహణను ఆమె ప్రతిపాదించారు. తూర్పున దంకునిని పశ్చిమాన సూరత్‌తో కలిపే కొత్త అంకితమైన తూర్పుపశ్చిమ సరుకు రవాణా కారిడార్‌ను ప్రకటించారు.

చిన్న, సన్నకారు రైతులకు ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శుభవార్త చెప్పారు. చిన్న, సన్నకారు రైతుల ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పార్లమెంట్ వేదికగా స్పష్టం చేశారు.. దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు.. 500 రిజర్వాయర్లలో చేపల పెంపకం, అభివృద్ధికి పెద్ద పీట వేయనున్నారు. పశు సంవర్ధక శాఖలో భారీగా ప్రోత్సాహకాలు.. వ్యవసాయ ఆదాయం పెంచేందుకు అధిక విలువ పంటలకు ప్రోత్సాహం.. తీర ప్రాంతాల్లో కొబ్బరి, గంధం చెట్ల నాటకానికి ప్రోత్సాహం ఇస్తామని ప్రకటించారు.. కొబ్బరి ఉత్పత్తి పెంపునకు ప్రత్యేక ప్రోత్సాహక పథకం.. కాయలు కాయని చెట్ల స్థానంలో కొత్త చెట్ల నాటకానికి ప్రోత్సాహకాలు అందిస్తామని స్పష్టం చేశారు. ఇవాళ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌పై రైతులు మరో ఆశ పెట్టుకున్నారు. పంట పెట్టుబడి సాయం కింద కేంద్రం ఏటా అందించే పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన మొత్తాన్ని పెంచుతుందని. 2019లో ఈ పథకం ప్రారంభమైనప్పటి నుంచి పెట్టుబడి సాయం కింద కేంద్రం ఏటా రూ. 6 వేలు మాత్రమే అందిస్తుంది. దీనిని రూ. 8 వేలు లేదా 10 వేలకు పెంచాలని ఎప్పటినుంచో రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ అంశంపై ఇంకా క్లారిటీ ఇవ్వలేదు.

ఈ బడ్జెట్‌ను మూడు ప్రధాన కర్తవ్యాల ప్రాతిపదికన రూపొందించినట్లు మంత్రి ప్రకటించారు. ఇందులో ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడం, ప్రపంచ మార్కెట్లతో భారత్‌ను అనుసంధానించడంతో పాటు.. యువత, పేదలు, దళితులు, ఆదివాసీల ఆకాంక్షలను నెరవేర్చడం వంటి వాటిని పొందుపరిచారు.దేశాభివృద్ధిలో కీలకమైన మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రభుత్వం ఈసారి రికార్డు స్థాయిలో రూ. 12.2 లక్షల కోట్లు కేటాయించింది. గత ఏడాది ఇది రూ. 11.2 లక్షల కోట్లుగా ఉండేది. మరోవైపు సెమీకండక్టర్ & టెక్నాలజీలో విప్లవం సృష్టించేలా ప్రకటన చేశారు. ఇందులో సెమీకండక్టర్ ఇండియా మిషన్ 2.0 కింద చిప్ తయారీలో భారత్‌ను గ్లోబల్ హబ్‌గా మార్చేందుకు రూ. 40,000 కోట్లు కేటాయించారు.

అలాగే రేర్ ఎర్త్ మినరల్స్ సంబంధించి ఆంధ్రప్రదేశ్, కేరళ, ఒడిశా సహా 5 రాష్ట్రాల్లో అరుదైన ఖనిజాల వెలికితీత కోసం ప్రత్యేక పథకాన్ని ప్రకటించారు. అలాగే పరిశ్రమలను విద్యాసంస్థలతో అనుసంధానం చేస్తూ కొత్తగా హైటెక్ టూల్ రూమ్స్‌ను ఏర్పాటు చేయనున్నారు. రాబోయే ఐదేళ్లలో బయో ఫార్మా తయారీని ప్రోత్సహించేందుకు రూ.10,000 కోట్లతో కొత్త పథకాన్ని ప్రారంభించారు.ఇక ఫార్మా విద్యా సంస్థలు సంబంధించి జాతీయ స్థాయిలో మూడు కొత్త ఫార్మా విద్యా, పరిశోధనా సంస్థలను స్థాపించనున్నారు. ఇంకా జౌళి రంగంలో ఉపాధి పెంచేందుకు మెగా పార్కుల ఏర్పాటుతో పాటు, అంతర్జాతీయ బ్రాండింగ్ కోసం ప్రత్యేక కార్యాచరణను ప్రకటించారు. ఇంకా దేశంలో కొత్తగా మూడు ప్రపంచ స్థాయి రసాయన పార్కుల ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. వీటితో పాటు ఎగుమతులను ప్రోత్సహించేందుకు అంతర్జాతీయ స్థాయి కంటైనర్ తయారీ కార్పొరేషన్ స్థాపన ఏర్పాటు కానుంది. ముఖ్యంగా డిజిటల్ కనెక్టివిటీని పెంచే దిశగా కొత్త ఫైబర్ పాలసీని తీసుకురానున్నట్లు మంత్రి పేర్కొన్నారు. "సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్" మంత్రంతో 2025 ఆగస్టు తర్వాత ప్రభుత్వం 350కి పైగా సంస్కరణలు తీసుకువచ్చిందని, 7 శాతం వృద్ధి రేటుతో భారత్ స్థిరంగా ముందుకు సాగుతోందని ధీమా వ్యక్తం చేశారు.ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చడమే తమ లక్ష్యమని నిర్మల స్పష్టం చేశారు.. ప్రధాని ఆలోచనలకు అనుగుణంగా ఎన్నో కొత్త సంస్కరణలను తీసుకొస్తున్నామని చెప్పారు.. ఈ బడ్జెట్ 'యువశక్తి బడ్జెట్' అని ప్రస్తావించారు. నిర్మాణాత్మక సంస్కరణలతో ఈ కర్తవ్యాలను సాధిస్తామని స్పష్టం చేశారు. అనంతరం మూడు కర్తవ్యాలను లక్ష్యాలుగా ప్రకటించారు. మొదటి కర్తవ్యం సమ్మిళిత ఆర్థిక వృద్ధి, రెండో కర్తవ్యం వృద్ధిలో ప్రజల భాగస్వామ్యం, మూడో కర్తవ్యం 'సబ్ కా సాత్, సబ్ కా వికాస్' గా తెలిపారు. సంస్కరణలతో కూడిన అభివృద్ధి మంత్రం అని పార్లమెంట్ వేదికగా ఆర్థిక మంత్రి తెలిపారు.. ఫిస్కల్ డిసిప్లిన్‌ను సాధించాం.. జనవరిలో జీఎస్టీ కలెక్షన్లు రూ. 1.93 లక్షల కోట్లు వసూళ్లు చేసినట్లు వెల్లడించారు.. ఎకానమీలో నిలకడ వచ్చిందని చెప్పారు.. ద్రవ్యోల్బణం మోడరేట్‌గా ఉందని స్పష్టం చేశారు.ప్రస్తుతం కాలంలో టెక్నాలజీకి ఎంతో అవసరమైన సెమీ కండక్టర్లు, రేర్ ఎర్త్ ఖనిజాలకు కేంద్ర బడ్జెట్ 2026 పెద్ద పీట వేసింది. సెమీకండక్టర్ ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు భారత్ సెమీకండక్టర్ మిషన్ 2.0ని ప్రారంభించనున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. దీని కోసం రూ. 40,000 కోట్లు కేటాయించారు. అంతర్జాతీయంగా జియోపాలిటిక్స్‌లో కీలకంగా రేర్ ఎర్త్ ఖనిజాలు, రేర్ ఎర్త్ అయస్కాంతాలు మారాయి. ఈ రంగంలో చైనా గుత్తాధిపత్యం చెలాయిస్తోంది. ఇతర దేశాలపై ఆధారపడకుండా ఉండేందుకు భారత్ కూడా రేర్ ఎర్త్ ఖనిజాల అన్వేషణ, అయస్కాంతాల తయారీకి ప్రాధాన్యత ఇస్తోంది. ఈ నేపథ్యంలోనే ఈ బడ్జెట్‌లో తమిళనాడు, కేరళ, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లలో "రేర్ ఎర్త్ కారిడార్" ఏర్పాటు చేయబోతున్నట్లు నిర్మలా సీతారామన్ చెప్పారు. ఈ రాష్ట్రాలు అరుదైన ఖనిజాలను కలిగి ఉన్నాయి. మైనింగ్ మౌలిక సదుపాయాలు, ప్రాసెసింగ్, ఎగుమతుల్ని సులభతరం చేసే ఓడరేవులు సమీపంలో ఉన్నాయి. భారత్ రేర్ ఎర్త్స్ దిగుమతులపై ఆధారపడకుండా ఉండేందుకు ఇది సహకరిస్తుంది. ఎలక్ట్రానిక్స్,రక్షణ, క్లీన్ ఎనర్జీ, ఈవీ ఇండస్ట్రీల్లో సెమికండక్టర్లు, రేర్ ఎర్త్ పరికరాలు చాలా అవసరం.

ప్రతి ఏడాది ప్రవేశ పెట్టే కేంద్ర బడ్జెట్ అంటే ఆర్థిక కేటాయింపులు, సంస్కరణలపైనే కాదు.. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ధరించే చీరలపైనా దేశవ్యాప్తంగా ప్రత్యేక ఆసక్తి నెలకొంది. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్ని ప్రతిబింబించేలా ఆమె ఎంచుకునే చేనేత చీరలు ఎంతో మంది మహిళలకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. ఇక, ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచే నిర్మలా సీతారామన్ ఎక్కువగా దేశీయ చేనేత చీరలకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ముఖ్యంగా బడ్జెట్ రోజున ఆమె ధరించే చీరకు ఏదో ఒక స్పెషల్ ఉండేలా చూసుకుంటారు.

మధ్యతరగతి ప్రజలకు, చిన్న తరహా పన్ను చెల్లింపుదారులకు ఊరటనిస్తూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ 2026లో కీలక ప్రకటనలు చేశారు. దశాబ్దాల కాలం నాటి పన్ను నిబంధనలను పక్కన పెట్టి సామాన్యులకు సైతం అర్థమయ్యేలా 'కొత్త ఆదాయపు పన్ను చట్టం - 2025'ను ఏప్రిల్ 1, 2026 నుంచి అమలులోకి తీసుకువస్తున్నట్లు ప్రకటించారు. కొత్త చట్టం ద్వారా పన్ను ప్రక్రియను మరింత సరళతరం చేయడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశ్యం అని అన్నారు. ఇందులో భాగంగా ప్రధానంగా ప్రకటించిన అంశాల విషయానికి వస్తే.. విద్య, వైద్య సేవలపై అలాగే విదేశీ టూర్ ప్యాకేజీలపై ఉన్న టీసీఎస్ ను 5% నుంచి 2 శాతానికి తగ్గించారు. ఇది విదేశాల్లో చదువుకునే విద్యార్థులకు, చికిత్స పొందే వారికి పెద్ద ఊరట కానుంది. అలాగే సవరించిన పన్ను రిటర్నుల దాఖలు గడువును డిసెంబర్ 31 నుంచి మార్చి 31 వరకు పొడిగించారు. ఇంకా చిన్న తరహా ఆదాయపన్ను చెల్లింపుదారుల కోసం ప్రత్యేకంగా 6 నెలల పాటు ఊరటనిచ్చే పథకాన్ని కూడా ప్రకటించారు మంత్రి. ముఖ్యంగా రహదారి ప్రమాదాల వల్ల వచ్చే పరిహారంపై వడ్డీకి పన్ను మినహాయింపు ఇచ్చారు.

ఇవి ఇలా ఉండగా.. ఐటీ రిటర్న్స్ ఫైల్ చేయడం ఇకపై మరింత సులభం కానుంది. సామాన్యులు కూడా సొంతంగా ఫైల్ చేసేలా సరళతరమైన ఫారాలను త్వరలోనే అందుబాటులోకి తెస్తామని మంత్రి అన్నారు. ఇందులో భాగంగా ఐటీఆర్1, ఐటీఆర్2 ఫారాలు జులై 31 వరకు అందుబాటులో ఉంటాయని అన్నారు. ఇంకా మ్యాన్ పవర్ సరఫరా చేసే సంస్థలపై TDSను 1 లేదా 2 శాతానికి పరిమితం చేశారు మంత్రి. విదేశాల్లో ఆస్తులు కలిగి ఉండి, వాటిని వెల్లడించని వారి కోసం ప్రభుత్వం 'వన్ టైమ్ స్కీమ్'ను ప్రకటించింది. ఈ పథకం ద్వారా ఎటువంటి జరిమానాలు లేకుండా విదేశీ ఆస్తులను వెల్లడించే అవకాశం కల్పించింది.



**బడ్జెట్ స్వరూపమిదే..**

| | |
|---|---|
| మొత్తం బడ్జెట్ : | రూ.53,47,315 కోట్లు |
| రెవెన్యూ వసూళ్లు : | రూ.35,33,150 కోట్లు |
| మూలధన వసూళ్లు : | రూ.18,14,165 కోట్లు |
| పన్ను వసూళ్లు : | రూ.28,66,922 కోట్లు |
| పన్నేతర వసూళ్లు : | రూ.6,66,228 కోట్లు |
| రుణాల రికవరీ : | రూ.38,397 కోట్లు |
| ఇతర వసూళ్లు : | రూ.80,000 కోట్లు |
| అప్పులు, ఇతర వసూళ్లు : | రూ.16,95,768 కోట్లు |
| వడ్డీ చెల్లింపులు : | రూ.14,03,972 కోట్లు |

## 12వ బడ్జెట్ లోనూ తెలంగాణ కు గుండు సున్నానే

* 8 మంది బీజేపీ ఎంపీలను గెలిపించినా తెలంగాణకు తీరని అన్యాయం*
* ఏళ్లుగా తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్న బీజేపీ సర్కార్*
* విభజన హామీలు సహా తెలంగాణకు రావాల్సిన నిధులపై కిక్కురుమనని ఆర్థిక మంత్రి*
* మోడీ నిత్యం వల్లవేసే కో-ఆపరేటివ్ ఫెడరలిజం అంటే ఇదేనా?*
* కేంద్ర బడ్జెట్ పై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత.*




హైదరాబాద్, (ప్రజాస్వరం):

వరుసగా 12వ ఏడాది కేంద్రంలోని బీజేపీ సర్కారు తెలంగాణకు గుండు సున్నానే దక్కిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఒక ప్రకటనలో మండిపడ్డారు. కేంద్ర బడ్జెట్ పై ఎక్స్ వేదిక స్పందించారు. పన్నెండేళ్లుగా తెలంగాణను మోసం చేయటం బీజేపీకి అలవాటుగా మారిందని మండిపడ్డారు. కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై ఆమె ట్వీట్ చేశారు. కోఆపరేటివ్ ఫెడరలిజం అంటూ ప్రధాని మోడీ నిత్యం చెబుతుంటారు కానీ ఆచరణ లో మాత్రం పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. విభజన హామీలు సహా తెలంగాణ ప్రాజెక్ట్ లకు రావాల్సిన నిధులన్నింటినీ పెండింగ్ లో పెట్టారని విచారం వ్యక్తం చేశారు. స్థిరత్వం, క్రమశిక్షణ, వృద్ధి అంటూ నినాదాలు చెప్పే బీజేపీ పెద్దలు ఎందుకు తెలంగాణ విషయంలో వివక్ష చూపుతున్నారో చెప్పాలని ప్రశ్నించారు.

**8 మంది ఎంపీలను ఇస్తే తిరిగి ఇచ్చింది గుండుసున్నా.**


తెలంగాణ నుంచి బీజేపీకి 8 మంది ఎంపీలను ఇస్తే రాష్ట్రానికి మాత్రం గుండుసున్నా ఇచ్చారని మండిపడ్డారు. రాష్ట్రానికి నిధులు రావాల్సిన దానికి బదులు పెండింగ్ ఫైల్స్ వస్తున్నాయన్నారు. 34 వేల 367 కోట్ల తో చేపట్టాల్సిన రీజినల్ రింగ్ రోడ్, హైవేలు, రేడియల్ రోడ్లకు నిధులు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. మెట్రో ఫేజ్ 2 విస్తరణకు ఇవ్వాల్సిన 50 శాతం నిధులు ఇవ్వలేదన్నారు. కొత్త రైల్వే లైన్స్ కు క్లియరెన్స్ లు ఇవ్వకపోగా, వరంగల్ కోచ్ ఫ్యాక్టరీని అటకెక్కించారని మండిపడ్డారు. తెలంగాణకు దక్కాల్సిన ఐఐఎం, 16 నవోదయ విద్యాలయాలు, 9 కేంద్రీయ విద్యాలయాలను ఇవ్వటం లేదన్నారు. విభజన చట్టం హామీలైన బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీని పట్టించుకోవటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే విధంగా పారిశ్రామిక ప్రోత్సహకాలు ఏమీ ఇవ్వలేదన్నారు. ఇలా చెప్పుకుంటే పోతే తెలంగాణకు బీజేపీ చేసిన అన్యాయాల జాబితా చాంతాడంతా ఉందన్నారు. ప్రధాని మోడీ చెప్పే కో ఆపరేటివ్ ఫెడరలిజం అంటే తెలంగాణ ప్రయోజనాలను కాలరాయమటేనా అని ప్రశ్నించారు.

## మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారడమే లక్ష్యం..

మొదటిపేజీ తరువాయి

పేర్కొన్నారు.

భారతదేశంలోని ధైర్యవంతులైన, ప్రతిభావంతులైన యువతకు ఎదగడానికి ఓపెన్ ఆకాశాలను అందిస్తాయని చెప్పారు. భారతదేశంలోని 140 కోట్ల మంది పౌరులు వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా ఉంటుందన్నారు. ఈ బడ్జెట్ అపార అవకాశాలకు దారితీసే మార్గం అని.. ఇది నేటి ఆకాంక్షలను వాస్తవంగా మారుస్తుందని పేర్కొన్నారు. భారతదేశ ఉజ్వల భవిష్యత్తుకు పునాదిని బలపరుస్తుందని ప్రధాని మోడీ అన్నారు. మహిళా సా



ధికారతకు నిదర్శనంగా ఉందని.. వరుసగా తొమ్మిదిసార్లు దీనిని లోక్‌సభలో ప్రవేశపెట్టి నిర్మలాసీతారామన్ రికార్డు సృష్టించారని ప్రధాని మోడీ కొనియాడారు.

## బాబు హుషార్.. రేవంత్ జీహుజూర్..

మొదటిపేజీ తరువాయి

అనుమతులను అంగీకరించేది లేదంటూ కరాఖండిగా చెప్తున్నది. మరోవైపు అవార్డుకు విరుద్ధంగా, ఎలాంటి అనుమతుల్లేకుండానే ఇబ్బడిముబ్బడిగా ప్రాజెక్టులను నిర్మిస్తున్నది. అదేమంటే కేంద్రాన్ని ముందుకు నెడుతూ పోలవరం నల్లమలసాగర్ ప్రాజెక్టుకు అనుమతులు సాధించేందుకు కుట్రల మీద కుట్రలకు తెరలేపుతున్నది. కృష్ణా ట్రిబ్యునల్ తరహాలోనే గో దావరి ట్రిబ్యునల్ ఏర్పాటుకు అడుగులు వేస్తున్నది. ఇక రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి సర్కార్ సైతం అందుకు వంతపాడుతూ తెలంగాణ ప్రయోజనాలను పణంగా పెడుతున్నది. ఒకవైపు ప్రాజెక్టులను నిర్మించకుండా, మ రోవైపు చర్చలకు పరుగులు పెడుతూ ఏపీ ఎత్తులకు రాష్ట్ర ప్రభుత్వం జీహుజూర్ అంటున్నది.

**సెక్షన్-3పై ఆది నుంచీ అక్కసు..**

రాష్ట్ర విభజన సందర్భంగా కృష్ణా జలాల వినియోగానికి సంబంధించి ఏపీ పునర్విభజన చట్టం 2014 సెక్షన్89 పేరిట మార్గదర్శకాలను జారీచేశారు. అప్పటికే జరిగిన నీటి కేటాయింపులను ప్రాజెక్టుల వారీగా మార్చాలని మాత్రమే నిర్దేశించారు. దీంతో తెలంగాణకు 299 టీఎంసీలకు మించి ఒక్క చుక్క కూడా అదనంగా వచ్చే అవకాశం లేకుండాపోయింది. ఏపీకి 512 టీఎంసీలు దక్కుతాయి. సెక్షన్89 ప్రకారం తెలంగాణకు ఎలాంటి ప్రయోజనం చేకూరదని కేసీఆర్ ప్రభుత్వం నాడు తీవ్రంగా వ్యతిరేకించింది. అంతర్రాష్ట్ర జలవివాదాల చట్టం 1956 సెక్షన్3 ప్రకారం కృష్ణా జలాలను తెలంగాణ, ఏపీ మధ్య న్యాయమైన వాటా వేయాలని డిమాండ్ చేసింది. పదేండ్ల పాటు కేంద్రంపై పోరాడి అపూర్వ విజయాన్ని సాధించింది. తెలంగాణకు నీటిహక్కులు సాధించేందుకు బాటలు వేసింది. ఈ నేపథ్యంలోనే కృష్ణా జలాల వివాదాల ట్రిబ్యునల్2 (కేడబ్ల్యూడీటీ)కు కేంద్రం నూతన మార్గదర్శకాలను జారీచేసింది. అప్పటినుంచి ఏపీ సర్కార్ అక్కసు వెల్లగక్కుతూనే ఉన్నది. తొలుత సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్‌దాఖలుచేసింది. ఆపై ట్రిబ్యునల్‌లోనూ వాదనలను వినిపిస్తున్నది. సెక్షన్3 కొత్త టీవోఆర్ చెల్లబోదని, ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టానికి అది విరుద్ధమని వాదిస్తున్నది.

**నిస్సిగ్గుగా కేంద్ర సర్కార్ మంతనాలు..**

ఇదిలాఉంటే ఏపీని నిలువరించాల్సిన కేంద్రం దానికి వత్తాసు పలుకుతున్నది. సెక్షన్3పై ఏపీ వేసిన రిట్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు గతంలోనే తిరస్కరించింది. నూతన మార్గదర్శకాల ప్రకారమే ట్రిబ్యునల్ సైతం విచారణ కొనసాగిస్తున్నది. కృష్ణా జలాల దోపిడీ, అక్రమ ప్రాజెక్టుల నిర్మాణం తదితర అంశాలపై గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేకమార్లు కేంద్రానికి ఫిర్యాదు చేసింది. అవార్డు ప్రకారమే నీటి వినియోగాలకు అనుమతివ్వాలని పట్టుబట్టింది. దీనిపై ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ సైతం పలుమార్లు ఫిర్యాదుచేసింది. కానీ ఒక్క అంశంలోనూ కేంద్రం తెలంగాణకు సహకరించ లేదు. అదేమంటే ట్రిబ్యునల్ విచారణ కొనసాగుతున్నదంటూ కుంటిసాకును చూపి తప్పించుకుంటున్నది. అవార్డు అమల్లోకి రావాలంటూ చోద్యం చూసింది. ఏపీ తరపున వకాల్తా పుచ్చుకున్న రీతిలో ఆది నుంచీ వ్యవహరిస్తున్నది. ఇదిలా ఉంటే ఏపీ ప్రభుత్వం చేపట్టిన పోలవరం బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు సంబంధించి పీఎఫ్‌ఆర్ (ప్రీ ఫిజబులిటీ రిపోర్టు)పై సీడబ్ల్యూసీ, ఎన్‌డబ్ల్యూడీఏ (నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ), కృష్ణా, గోదావరి రివర్‌బోర్డులు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ), బేసిన్‌లోని అన్ని రాష్ట్రాలు అభ్యంతరం తెలిపాయి. బనకచర్ల ప్రాజెక్టుపై ముందుకుపోవద్దని కేంద్రానికి స్పష్టంగా తెలియజేశాయి.

# ఆ పెద్దాయన... మీరేనా...?

మొదటిపేజీ తరువాయి

ఆదేశాల మేరకే ఫోన్ ట్యాపింగ్ చేశామని పలువురు అధికారులు విచారణలో చెప్పడంతో ఆ పెద్దాయన మీరేనా? మీ ఆదేశాల మేరకు ఫోన్ ట్యాపింగ్ జరిగిందా? ఫోన్ ట్యాపింగ్ లో మీ ప్రమేయం ఏంటి అనే కోణంలో సిట్ అధికారులు ప్రశ్నలు సంధించినట్లు తెలుస్తోంది. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి వినియోగించిన పరికరాలు ఎక్కడి నుంచి వచ్చాయి..? ఎవరి ఆదేశాల మేరకు ఇవి పనిచేశాయి..? అన్న అంశాలపై సిట్ దృష్టి సారించింది. గతంలో విచారించిన అధికారుల వాంగ్మూలాలను, సాంకేతిక ఆధారాలను కేసీఆర్‌కు చూపించి, వాటిపై ఆయన వెర్షన్‌ను సిట్ రికార్డ్ చేసింది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం ఎవరి ఆదేశాల మేరకు జరిగింది? అందులో ఎవరెవరి పాత్ర ఉందనే కోణంలో ప్రశ్నించినట్లు తెలుస్తోంది. కేసీఆర్ విచారణ అనంతరం కేసీఆర్ స్టేట్మెంట్ రికార్డ్స్, విచారణకు వినియోగించిన రెండు ట్రంకు డబ్బాలు పలు ఫైల్స్ ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకువెళ్లారు. మాధాపూర్ డీసీపీ రీతిరాజ్, ఐపీఎస్ విజయ్ కుమార్, ఐపీఎస్ నారాయణరెడ్డి, అడిషనల్ ఎస్పీలు అరవింద్ కుమార్, కేఎస్ రావు కేసీఆర్ ను ప్రశ్నించారు. ఆయన చెప్పిన విషయాలన్నింటినీ సిట్ అధికారులు రికార్డు చేసుకున్నారు. విచారణ మొదలుకాకముందే సిట్ అధికారులు ఎలక్ట్రానిక్ పరికరాలతో కేసీఆర్ గదిని పూర్తిగా తనిఖీ చేశారు. విచారణ ప్రక్రియ మొత్తాన్ని వీడియోలో రికార్డ్ చేశారు. కేసీఆర్ వెంట మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు, సంతోష్ రావులను మాత్రమే ఇంట్లోకి అనుమతించారు. అయితే.. విచారణ జరుగుతున్న గదిలోకి ఎవరినీ.. కనీసం లాయర్‌ను కూడా అనుమతించలేదు. ఎర్రవల్లి నుంచి వస్తున్న సమయంలో భారీగా తరలివచ్చిన పార్టీ కార్యకర్తలను పోలీసులు మార్గమధ్యలో అడ్డుకుని.. కేవలం కేసీఆర్ వాహనాలను మాత్రమే అనుమతించారు. విచారణ కొనసాగుతుండగా.. ఆయన నివాసంలో కాస్త ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విచారణ ముగిసిన అనంతరం కేసీఆర్ మద్దతుదారుల వైపు చేయి ఊపుతూ లోపలికి వెళ్లారు. తదుపరి సిట్ అధికారులు ఈ వివరాలను కోర్టుకు సమర్పించనున్నారు. కాగా ఎర్రవల్లిలోని ఫామ్ హౌస్ నుంచి వచ్చిన కేసీఆర్ తన వెంట ఒక నోట్ బుక్, పలు డాక్యుమెంట్లు తెచ్చుకున్నారు. సిట్ అడిగే ప్రశ్నలను ఆయన నోట్ చేసుకున్నారు. ఇక తన వెంట తెచ్చిన డాక్యుమెంట్లలో ఏముందనేది ఎవరికీ తెలియరాలేదు. విచారణను సిట్ అధికారులు వీడియో రికార్డు చేశారు. ఆదివారం మధ్యాహ్నం 11 గంటల ప్రాంతంలో ఎర్రవల్లి ఫామ్ హౌస్ నుంచి కేసీఆర్ నందినగర్ నివాసానికి వచ్చిన కేసీఆర్ కు కేటీఆర్ స్వాగతం పలికారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు విచారణ ప్రారంభమైంది. విచారణకు ముందే కేసీఆర్ నివాసానికి చేరుకున్న సిట్ అధికారులు బిల్డింగ్ లోని రెండో అంతస్తులో ఒక గదిలో విచారణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. విచారణ సమయంలో కేసీఆర్ వెంట ఒకరు ఉండేందుకు అవకాశం కల్పించారు. దీంతో గులాబీ బాస్ వెంట మాజీ ఎంపీ సంతోశ్ రావు ఉంటారని బీఆర్ఎస్ లీగల్ టీమ్ సిట్ కు సమాచారం అందజేసింది. ఇక విచారణ సమయంలో కుటుంబ సభ్యులెగా కేటీఆర్, హరీశ్ రావు ఇంట్లోనే ఉన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలు అందరూ తెలంగాణ భవన్ లోనే ఉన్నారు.

**కేసీఆర్ భావోద్వేగం**

నందినగర్‌లోని ఆయన నివాసంలోని రెండో అంతస్తులో ఉన్న ప్రత్యేక గదిలో సిట్ అధికారులు కేసీఆర్ ను విచారించారు. ఈ క్రమంలో విచారణకు ముందు కేసీఆర్ భావోద్వేగానికి గురయ్యారు. రాష్ట్ర సాధన కోసం గత పదేళ్లుగా ఏ గదిలో వ్యూహాలు రచించానో.. ఏ గదిలో నిద్రలేని రాత్రులు గడిపి ఉద్యమానికి దిశానిర్దేశం చేశానో.. అదే గదిలో ఇప్పుడు నిందితుడిలా విచారణ ఎదుర్కోవడం బాధాకరమని ఆయన సన్నిహితుల దగ్గర ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. 'రాష్ట్రం కోసం పోరాడిన చోటే ఇలాంటి పరిస్థితులు వస్తాయని కలలో కూడా అనుకోలేదు' అని ఆయన ఆవేదనను వ్యక్తం చేశారు.




**అట్టుడికిన నగరం...**

ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్ విచారణకు నిరసనగా బీఆర్ఎస్ నేతలు, బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నిరసనలకు దిగారు. హైదరాబాద్ లోని తెలంగాణ భవన్ కు భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. అక్కడి నుంచి సీఎం రేవంత్ నివాసాన్ని ముట్టడించేందుకు వెళ్తుండగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. బీఆర్ఎస్ శ్రేణులు ఏ క్షణానైనా సీఎం నివాసాన్ని ముట్టడించే అవకాశం ఉండటంతో సీఎం రేవంత్ నివాసం వద్ద పోలీసులు భద్రత పెంచారు. సీఎం ఇంటికి వెళ్లే మూడు దారుల్లోనూ పోలీసులు అడుగడుగునా భద్రతా కట్టదిట్టం చేశారు. మరోవైపు హైదరాబాద్ లోని మినిస్టర్ క్వార్టర్స్ వద్ద బీఆర్ఎస్ శ్రేణుల ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. కేసీఆర్ సిట్ విచారణను నిరసిస్తూ.. బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నేతలు నల్ల జెండాలతో మినిస్టర్ క్వార్టర్స్ ను ముట్టడించి సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. అక్కడే ధర్నాకు దిగారు. ఆ ప్రాంతంలో భారీగా మోహరించిన పోలీసులు.. బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్, తుంగ బాలును అరెస్ట్ చేశారు. మినిస్టర్ క్వార్టర్స్ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించిన విద్యార్థి నాయకుల్ని అడ్డుకున్నారు. మరోవైపు కేసీఆర్ సిట్ విచారణ నేపథ్యంలో ఆయన ఇంటి చుట్టూ పోలీసులు నాలుగంచెల భద్రతను ఏర్పాటు చేశారు. ఐదుగురు డీసీపీలు బందోబస్త్ నిర్వహించారు. ఆ చుట్టు పక్కల ప్రాంతాలకు బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలి వచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు బీఆర్ఎస్ పిలుపునివ్వడంతో నేతలు, కార్యకర్తలు బైక్ ర్యాలీలు నిర్వహించి నిరసనలు వ్యక్తం చేశారు. మరోవైపు హైదరాబాద్‌లోని సెక్రటేరియట్ ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మ దహనం చేశారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు బొమ్మకు అంటుకున్న మంటలను ఆర్పారు. పలువురు బీఆర్ఎస్ నాయకులను అదుపులోకి తీసుకున్నారు. దీంతో సచివాలయం పరిసరాల్లో ఉద్రిక్తత చోటుచేసుకుంది.

## ఎస్ఎల్‌బీసీపై నిర్లక్ష్యం చేస్తే సహించం

మొదటిపేజీ తరువాయి

సారించినట్లు వెల్లడించారు. దని ఆయన వివరించారు. అర్ధాంతరంగా నిలిచి పోయిన ఎస్.ఎల్.బి.సి పనుల పునరుద్ధరణ కోసం చేపట్టిన హెలిబోర్న్ సర్వే నివేదిక ప్రభుత్వానికి చేరిందని తెలిపారు. శ్రీశైలం ఎడమగట్టు కాలువతో పాటు కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో అంతర్భాగమైన మేడిగడ్డ, సుందిళ్ళ,అన్నారం బ్యారేజ్ ల పునరుద్ధరణ పనులపై ఆయన ఆదివారం సాయంత్రం హైదరాబాద్ లో నీటిపారుదల శాఖాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎస్.ఎల్.బి.సి సొరంగ మార్గం మిగిలిన భాగం పూర్తి చేయడానికి అవసరమైన నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ సహకారంతో నిర్వహించిన ఏరియల్ ఎలక్ట్రో మాగ్నెటిక్ సర్వే నివేదిక ప్రభుత్వానికి చేరిందని ఆయన తెలిపారు. సొరంగమార్గం పూర్తికి సర్వే ఆధారంగా రూపొందించిన నివేదిక దోహద పడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. భౌగోళికంగా ప్రతికూల పరిస్థితిలు ఏర్పడితే ముందస్తుగా బందోబస్తు చర్యలు చేపట్టదానికి ఈ సర్వే ఉపకరిస్తుందని పేర్కొన్నారు. సొరంగ మార్గం పూర్తి చేసేందుకు ఆధునిక పరిజ్ఞానం వినియోగించడంతో పాటు శాస్త్రీయ పద్ధతిలో నిరంతరం అధికారుల పర్యవేక్షణలో పనులు కొనసాగేలా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు నిర్వహణకు ప్రత్యేకంగా డివిజన్ ఏర్పాటు చేయడంతో పాటు ఆపరేషన్ బృందానికి ప్రత్యేక చీఫ్ ఇంజనీర్ ను నియమించాలని ఆదేశించారు. నిర్మాణం జరుగుతున్న సమయంలో ఎప్పటికప్పుడు భద్రతా,నాణ్యత ప్రమాణాలను పాటించేలా చూడడంతో పాటు అధికారులు రూపొందించిన డిజైన్ ప్రకారం నిర్మాణం కొనసాగేందుకు వీలుగా ప్రభుత్వం ప్రత్యేకంగా నియమించిన చీఫ్ ఇంజినీర్ కు సహకరించేలా ఉండేందుకు స్వతంత్ర పర్యవేక్షణ కన్సల్టెంట్ ను నియమించాలన్నారు. నిరంతరం పనుల పురోగతిని పర్యవేక్షించేందుకు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ క్షేత్ర స్థాయిలో భాగస్వామ్యులు అవుతారని ఆయన చెప్పారు. సొరంగ మార్గంలో ఏర్పదుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు అంచనా వేసేందుకు ప్రత్యేక జియో టెక్నికల్, జియాలజికల్ బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. దీంతో పాటు కాళేశ్వరం బ్యారేజ్ ల పనుల పునరుద్ధరణ పనులు వేగవంతం కోసం అవసరమైన సాంకేతిక సంస్థలను,డిజైన్ కన్సల్టెంట్స్ సమన్వయం ఆవశ్యకత గురుంచి మంత్రి వివరించారు. సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ నిర్వహించే పరీక్షల షెడ్యూల్ ,ప్రాజెక్ట డిజైనర్ల పనితో సమన్వయం ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పరస్పరం సమన్వయం చేసుకుంటూ పోతే కేంద్ర జల వనరుల సంఘం పరిధిలోని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నుండి డిజైన్ లకు దశలవారిగా అనుమతులు పొందడం సులభతరమౌతుందని ఆయన చెప్పారు . ఈ మేరకు ఫిబ్రవరి 16 తరువాత ఎన్.డి.ఎస్.ఏ నిపుణుల కమిటీ తో సమావేశం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పునరుద్ధరణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు అవసరమైన అనుమతులు పొంది పనులు వేగవంతం చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులకు సూచించారు.



## 'సిట్'కు కొత్త అర్థం చెప్పిన హరీశ్ రావు

* ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏర్పాటైన సిట్ ఒక "సీఎం ఇన్‌స్ట్రక్షన్ టీమ్" అన్న హరీశ్
* కేసీఆర్‌కు ఇచ్చిన నోటీసులు రాజకీయ కక్షసాధింపు చర్యలేనని ఆగ్రహం
* పాలనలోని వైఫల్యాల నుంచి దృష్టి మళ్లించేందుకే ఈ డ్రామా అంటూ విమర్శలు
* చట్టబద్ధం కాకపోయినా కేసీఆర్ దర్యాప్తునకు సహకరిస్తున్నారని వెల్లడి



హైదరాబాద్, (ప్రజాస్వరం):

ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)పై బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇది 'సిట్' (SIT) కాదని, 'సీఎం ఇన్‌స్ట్రక్షన్ టీమ్' (CIT) అని ఆయన కొత్త అర్థం చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశాల నుంచి ఫోన్‌లో ఏది చెబితే, పోలీసులు ఇక్కడ అదే పాటిస్తున్నారని ఆరోపించారు. సిట్ స్వతంత్రంగా పనిచేయడం లేదని, సీఎం కార్యాలయం నుంచి వచ్చే ఆదేశాల ప్రకారమే నడుచుకుంటోందని, "సిట్ అంటే సిట్, స్టాండ్ అంటే స్టాండ్" అన్నట్లుగా వారి వైఖరి ఉందని ఎద్దేవా చేశారు.

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడం రాజకీయ కక్షసాధింపు చర్యల్లో పరాకాష్ఠ అని హరీశ్ రావు అభివర్ణించారు. ఈ నోటీసుల వెనుక చట్టం లేదని, కేవలం సీఎం రేవంత్ రెడ్డి అహంకారం, రాజకీయ ప్రతీకారం మాత్రమే ఉన్నాయని ధ్వజమెత్తారు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన నేతకు కనీస మర్యాద ఇవ్వకుండా, ఆయన నివాసం ఎక్కడ ఉందో రాష్ట్రమంతటికీ తెలిసినా, నందినగర్‌లోని ఇంటి గోడకు నోటీసులు అంటించడం కాంగ్రెస్ ప్రభుత్వ చౌకబారు రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు.

పాలన చేతకాక, ఇచ్చిన హామీలు నెరవేర్చలేక, ప్రజా సమస్యలకు సమాధానం చెప్పలేక ప్రభుత్వంపై పెరుగుతున్న వ్యతిరేకతను పక్కదారి పట్టించేందుకే ఈ సిట్ డ్రామా ఆడుతున్నారని హరీశ్ రావు ఆరోపించారు. వరుస కుంభకోణాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు, మున్సిపల్ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే ఈ చిల్లర రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. చరిత్రను సృష్టించిన వ్యక్తి కేసీఆర్ అయితే, ఆ చరిత్రను మలినం చేయాలని చూస్తున్న చరిత్రహీనుడు రేవంత్ రెడ్డి అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

ప్రభుత్వం ఇచ్చిన నోటీసులు చట్టబద్ధం కానప్పటికీ, అనుసరించిన విధానం రాజ్యాంగ విరుద్ధమైనప్పటికీ.. కేసీఆర్ ఒక బాధ్యతాయుతమైన ప్రతిపక్ష నేతగా, భారత పౌరుడిగా దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తున్నారని హరీశ్ రావు స్పష్టం చేశారు. అయినప్పటికీ పోలీసులు అతిగా ప్రవర్తిస్తున్నారని, గజ్వేల్ నుంచి హైదరాబాద్ వరకు వేలాది మందిని మోహరించి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను అక్రమంగా అరెస్టులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ వారిని ఇబ్బందులకు గురిచేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. రైతుల కష్టాలు, యువత ఉద్యోగాలు, పింఛన్ల పెంపు వంటి అంశాలను గాలికొదిలి, ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వం పనిగా పెట్టుకుందని విమర్శించారు.

## సౌమ్య కుటుంబానికి కోటి రూపాయల సాయం.!

మొదటిపేజీ తరువాయి

భారీ పరిహారాన్ని ప్రకటించింది. విధి నిర్వహణలో చేరిన ఏడాది కాలంలోనే ఆమె చూపిన తెగువ, గంజాయి ముఠాను పట్టుకోవడంలో ఆమె కనబరిచిన పట్టుదల పోలీసు శాఖలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. సామాన్య కానిస్టేబుల్ స్థాయి నుంచి అసామాన్య పోరాటాన్ని ప్రదర్శించిన సౌమ్య మృతి పట్ల రాష్ట్రవ్యాప్తంగా నివాళులు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల నిజామాబాద్ జిల్లాలో గంజాయి ముఠా కదలికలను గమనించిన ఎక్సైజ్ అధికారులు వారిని పట్టుకునేందుకు మెరుపు దాడి చేశారు. ఈ క్రమంలో కానిస్టేబుల్ సౌమ్య.. ముఠా సభ్యులను అడ్డుకునేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. అయితే, పట్టుబడతామనే భయంతో ఆ గంజాయి ముఠా ఆమెను వాహనంతో బలంగా ఢీకొట్టి పరారైంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సౌమ్యను నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో వైద్యులు ఆమెకు ఒక కిడ్నీని తొలగించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ నిమ్స్‌కు తరలించినప్పటికీ, శనివారం ఆమె చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.

సౌమ్య మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ, ఆమె కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎక్సైజ్



శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కీలక ప్రకటనలు చేశారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసినందుకు గాను ఆమె కుటుంబానికి కోటి రూపాయల భారీ ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందజేస్తుంది. అంతేకాకుండా సౌమ్య సోదరుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించనున్నట్లు మంత్రి ప్రకటించారు.

# రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతుంది

*** బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మా దేవేందర్ రెడ్డి**

**రామాయంపేట, ఫ్రిబ్రవరి 01 ( ప్రజా స్వరం ) :**

తెలంగాణ రాష్ట్రంలో ప్రజా పాలన పేరిట రాక్షస పాలన కొనసాగుతుందని మెదక్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్ రెడ్డి అన్నారు. రామాయంపేట బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ ఆరు గ్యారెంటీ పథకాలు, 420 హామిలను అమలు చేయకుండా ప్రజలు నిలదీస్తారని డైవర్షన్ పాలిటిక్స్ నిర్వహిస్తున్నారని ప్రభుత్వంపై మండిపడ్డారు. కేసీఆర్ వల్లే తెలంగాణ రాష్ట్రం వచ్చిందని, కేసీఆర్ ప్రజల కష్టాలు తీర్చారని తెలిపారు. కెసిఆర్ తెలంగాణ ప్రజల ఆరాధ్య దైవమని తెలంగాణ ఏర్పాటు కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ఎదిరించి తెలంగాణ సాధించిన మహా గొప్ప వ్యక్తి అని ఆమె అన్నారు. తెలంగాణ రైతుల కోసం ఇబ్బందులు లేకుండా ఎన్నో సంక్షేమ పథకాల ప్రవేశ పెట్టి 24 గంటలకు ఉచిత విద్యుత్ తో పాటు తాగునీరు సాగునీరు అందించే రైతులను ఆదుకున్న ఘనత కేసిఆర్ కే దక్కిందని ఆమె అన్నారు. ప్రపంచం లోనే తెలంగాణ రాష్ట్రాన్ని నంబర్ వన్ గా ఉంచి వృద్ధులకు మహిళలకు పెన్షన్ల రూపంలో ఆదుకోవడం జరిగిందని, ప్రజలకు కనీసం అభివృద్ధి పదాలు అందించలేని కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ ఇబ్బందులు పెట్టేందుకే ఫోన్ టాపింగ్ అంటూ సీట్ నోటీసులు అందిస్తూ డైవర్షన్ పాలన కొన సాగిస్తున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ పల్లె జితేందర్, గౌడ్ మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్టి విజయలక్ష్మి యాదగిరి, సుభాష్‌రాథోడ్ పాల్గొన్నారు.



# తూప్రాన్ మున్సిపల్ ప్రచారంలో కారు జోరు

**తూప్రాన్, ఫిబ్రవరి 01 (ప్రజా స్వరం ) :**



తూప్రాన్ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా ఆదివారం రోజు ఆరు వ వార్డులో బి ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థిని కొక్కొండ సమతా కాశిరెడ్డి గడప గడప ప్రచారం రథం బ్యాండ్ మేళల తో ప్రచారం నిర్వహించారు కొక్కొండ కాశిరెడ్డి సతీమణి సమత మహిళలతో కలిసి ప్రచారం నిర్వహించారు బిఆర్ఎస్ ప్రభుత్వం పాలనలోనే అభివృద్ధి జరిగిందని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాటినుండి ఏదో తూతూ మంత్రంగా చిన్నపాటి సిసి రోడ్లు వేసి గొప్పలకు పోతున్నారు వారి మాయ మాటలు నమ్మొద్దు అని ఇచ్చినటువంటి హామీలు ఏమయ్యాయో ప్రచారానికి వచ్చిన నాయకులను నిలదీయాలని ఆడబిడ్డలకు నెలకు 2500 పింఛను పేదింటి పెళ్లికూతురుకి తులం బంగారం ఆటో డ్రైవర్లకు నెలకు 1000 అమ్మాయిలకు స్కూటీలు ఇస్తానన్న చదువుకునే వారికి ఫీజు రియంబర్స్మెంట్ హామీలన్నీ ఏమైనాట్టు మాట తప్పిన కాంగ్రెస్సు నమ్మొద్దని కొత్తవారికి అవకాశం ఇవ్వాలని జనంలోనే ఉంటూ ప్రజలకు సేవ చేసే అవకాశం ఇవ్వాలని ఆరు వ వార్డు ప్రజలను కోరారు బ్రహ్మారథం పడుతున్న ప్రజానీకం మీలో ఒకరిగా ఉంటాం కొక్కొండ సమతా కాశిరెడ్డి ఆరు వ వార్డు అభ్యర్థిని ఆదరించి ఆశీర్వదించండి.

# కేసీఆర్‌కు సిట్ నోటీసులు రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం



**జగదేవ్ పూర్, జనవరి31, (ప్రజాస్వరం) :**

కేసీఆర్ పై సిట్ విచారణను నిరసిస్తూ వట్టిపల్లి గ్రామంలో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఉపాధ్యక్షులు రామచంద్రం మాట్లాడుతూ.. కేసీఆర్‌పై సిట్ విచారణ రాజకీయ ప్రతీకారానికి అద్దం పడుతుందని, తెలంగాణలో ప్రస్తుతం జరుగుతున్న రాజకీయ పరిణామాలు ప్రజాస్వామ్యానికి సిగ్గుచేటుగా మారుతున్నాయన్నారు.అధికారన్ని దుర్వినియోగం చేసి పోలీసు వ్యవస్థను వాడుకోవడం ప్రజాస్వామ్యానికి మాయని మచ్చన్నారు. అలాగే తెలంగాణ ప్రజలు అమాయకులు కారు ఉద్యమాన్ని చూసిన ప్రజలు, చరిత్రను సృష్టించిన ప్రజలు, కేసీఆర్‌పై జరుగుతున్న ఈ దాడిని వారు నిశితంగా గమనిస్తున్నారని ఎన్నికలు ఎప్పుడు వొచ్చినా బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ,నాయకులు పాల్గొన్నారు.

# బీజేపీ మున్సిపల్ అభ్యర్థుల జాబితా విడుదల

**మెదక్ ఫిబ్రవరి 01 (ప్రజా స్వరం) :**

మెదక్ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మెదక్ జిల్లా బిజెపి అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్, మెదక్ మున్సిపల్ ఎన్నికల ప్రబారి సంగమేశ్వర్ ఆధ్వర్యంలో బిజెపి అభ్యర్థుల మొదటి లిస్టు విడుదల చేయడం జరిగింది. ఇందులో భాగంగా బీఫాం లిస్టు మున్సిపల్ కమిషనర్ కి అందజేశారు. బీ ఫోరం లో 1 వ వార్డు అభ్యర్థిగా మాస్కురి అండాళ్లు, 2 వ వార్డు రామ్ సింగ్, 3 వ వార్డు బుడ్డి చంద్రకళ, 4 వ వార్డు బి. నవీత, 5 వ వార్డు అందమ్ సాయి, 8 వ వార్డు లావణ్య, 10 వ వార్డు దీక్ష, 11 వ వార్డు వి. నవిత, 12 వ వార్డు బక్కవారి నిర్మల, 13 వ వార్డు చైతన్య, 14 వ వార్డు యశోద, 15 వ వార్డు నర్సింలు, 16 వ చంద్రశేఖర్, 17 వ వార్డు లక్ష్మి కౌర్, 21 వ వార్డు పబ్బ రాజమణి, 23 వ వార్డు రేఖ, 25 వ వార్డు మనోజ్ కుమార్, 26 వ వార్డు సైదులు, 27 వ వార్డు ఉషారాణి, 29 వ వార్డు చౌదరి రమేష్, 30 వ వార్డు బుడ్డి ఆంజనేయులు, 31 వ వార్డు సుంకోజు రాజు ను ప్రకటించారు.



ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి ఈర్ల రంజిత్ రెడ్డి మెదక్ మున్సిపల్ ఎన్నికల కన్వీనర్ ఏం ఎల్ ఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పార్టీ ఇంటింటా ప్రచారం

**తూప్రాన్ ఫిబ్రవరి 1 (ప్రజా స్వరం ) :**

మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపాలిటీలో బిఆర్ఎస్ పార్టీ తరఫున 16 వార్డులలో ప్రచార రథలు బ్యాండ్ మేళాలతో ప్రచారం సాగించారు తూప్రాన్ పట్టణం అభివృద్ధి చెందిందంటే కేవలం కేసీఆర్ పరిపాలన మాత్రమే అని బొంది అరుణ వెంకట్ గౌడ్ అన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటలు తప్పిందే తప్ప అభివృద్ధి చేసింది ఏమీ లేదని ప్రజలు గమనించాలని 12వ వార్డుల ప్రచారం చేస్తున్న బొంది అరుణ వెంకట్ గౌడ్ తెలిపారు ప్రజల నుండి మంచి స్పందన ఉందని ప్రజలు కారు గుర్తు కె ఓటు వేస్తాం అని ఆదరిస్తున్నారని చదువుకున్న అరుణకు అభివృద్ధి పథంలో12 వ నడపడానికి మీరు ఆశీర్వదించి గెలిపించాలని కోరారు గతంలో 11వ వార్డులో కౌన్సిలర్ గా ఉండి 11వ వార్డు పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశానని అదేవిధంగా ఈ 12వ వార్డులో కూడా భారీ ఓట్ల మెజార్టీతో గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా అని ప్రజలకు హామీ ఇచ్చారు టిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డాకే తూప్రాన్ మున్సిపాలిటీలో 200 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశారని బి ఆర్ ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డాకే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన అభివృద్ధి మాత్రమే కనిపిస్తుంది ఆమె అన్నారు ఆసుపత్రి ఇంటింటా తాగు నీరు వ్యవసాయం కోసం సాగు నీరు అందించిన ఘనత కేసీఆర్ దే అని బొంది అరుణ వెంకట్ గౌడ్ అన్నారు.





# మొదటి విడత బీజేపీ అభ్యర్థుల జాబితా విడుదల

**మెదక్ ఫిబ్రవరి 01 (ప్రజా స్వరం) :**

మెదక్ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మొదటి విడత బీజేపీ అభ్యర్థుల జాబితా విడుదల చేశారు. ఇందులో భాగంగా 1 వ వార్డు అభ్యర్థిగా మాస్కురి అండాళ్లు, 2 వ వార్డు రామ్ సింగ్, 3 వ వార్డు బుడ్డి చంద్రకళ, 4 వ వార్డు బి. నవీత, 5 వ వార్డు అందమ్ సాయి, 8 వ వార్డు లావణ్య, 10 వ వార్డు దీక్ష, 11 వ వార్డు వి. నవిత, 12 వ వార్డు బక్కవారి నిర్మల, 13 వ వార్డు చైతన్య, 14 వ వార్డు యశోద, 15 వ వార్డు నర్సింలు, 16 వ చంద్రశేఖర్, 17 వ వార్డు లక్ష్మి కౌర్, 21 వ వార్డు పబ్బ రాజమణి, 23 వ వార్డు రేఖ, 25 వ వార్డు మనోజ్ కుమార్, 26 వ వార్డు సైదులు, 27 వ వార్డు ఉషారాణి, 29 వ వార్డు చౌదరి రమేష్, 30 వ వార్డు బుడ్డి ఆంజనేయులు, 31 వ వార్డు సుంకోజు రాజు ను ప్రకటించడం జరిగింది.

# ఆపరేషన్ స్మైల్ విజయవంతం

* సమిష్టి కృషితోనే బాల కార్మికుల వ్యవస్థ జిల్లాలో పూర్తిగా నాశనం
* బాలలు బడులకి అంకితం కావాలని జిల్లా పోలీసుల పిలుపుతో ఆపరేషన్ స్మైల్ విజయవంతం
* జిల్లాలో 85 మంది బాల కార్మికులకు విముక్తి
* జిల్లావ్యాప్తంగా 35 కేసుల నమోదు
* 79 బాలురు, 06 బాలికలను రక్షించిన యంత్రాంగం
* 24 బయటి రాష్ట్రాల బాలబాలికలను రక్షించిన ఆపరేషన్ స్మైల్ బృందం
* 81 ఐఆర్ రిపోర్ట్ ల నమోదు
* జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్

**ఆదిలాబాద్ జిల్లా ఫిబ్రవరి 01 (ప్రజాస్వరం) :**

జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి ఆపరేషన్ స్మైల్ పేరుతో జనవరి 1 నుండి 31 వరకు నెలరోజుల పాటు నిర్వహించిన కార్యక్రమంలో జిల్లావ్యాప్తంగా 85 మంది బాలలను రక్షించి తల్లిదండ్రులకు మరియు వసతి గృహాలకు చేర్చి బాల కార్మికుల వ్యవస్థను నాశనం చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ ఒక పత్రిక ప్రకటన ద్వారా తెలియజేశారు. అన్ని శాఖల సమన్వయంతో ఆపరేషన్ స్మైల్ ను విజయవంతం చేయడం జరిగిందని తెలిపారు. ఈ ఆపరేషన్ స్మైల్ నందు జిల్లావ్యాప్తంగా 85 మంది పిల్లలను రక్షించినట్టు అందులో 72 మంది పిల్లలను తల్లిదండ్రులకు 13 మంది పిల్లలను వసతి గృహాలకు తరలించి సొంత వారికి అప్పగించినట్లు తెలిపారు. 85 మంది పిల్లలలో 79 మంది బాలురు 06 బాలికలు ఉన్నట్టు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 35 కేసులు నమోదు చేసి కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా ఇతర రాష్ట్రాల వారు ఇందులో 24 మంది ఉన్నట్లు తెలిపారు. ఆపరేషన్ స్మైల్ లో భాగంగా జిల్లా వెల్ఫేర్ కమిటీ కార్మిక శాఖ, విద్యాశాఖ, చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, వైద్య శాఖ, మరియు ఎన్జీవోల సహకారంతో జిల్లాలో ఆపరేషన్ స్మైల్ ను విజయవంతం చేసి బాల కార్మికులను గుర్తించి తగు చర్యలను తీసుకోవడం జరిగింది. ముఖ్యంగా రెస్క్యూ చేసిన వారిలో హోటల్లలో, భవన నిర్మాణాలలో, ఇటుక బట్టిలలో



పనులలో ఉన్న పిల్లలను గుర్తించి తల్లిదండ్రులకు అందజేసి అవగాహన కల్పించడం జరిగిందని బాలలను బడులకు పంపాలని తెలియజేయడం జరిగిందని తెలిపారు. ఇతర రాష్ట్రాల వారికి విడతలవారీగా వారి సొంత స్థలాలకు చేర్చి తల్లి దండ్రులకు కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగిందని తెలిపారు. చట్ట ప్రకారం నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నెల రోజులపాటు కొనసాగిన ఈ ఆపరేషన్ స్మైల్ తో ఆగకుండా, సంవత్సరం పాటుగా బాల కార్మికులు కనబడినట్లయితే వెంటనే డయల్ 100 ద్వారా తెలియజేయాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

# పాలన చేత కానీ సీఎం రేవంత్ రెడ్డి

* రాష్ట్ర నాయకులు ర్యాకల శేఖర్ గౌడ్
* కాళ్లకల్ లో దిష్టి బొమ్మ దహనం

**మనోహరాబాద్, ఫిబ్రవరి 1 (ప్రజా స్వరం ) :**

ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణలో భాగంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కి నోటీస్ జారీ చేయడం పట్ల, సిట్ విచారణ ను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ర్యాకల శేఖర్ గౌడ్ తీవ్రంగా కండించారు. మనోహరాబాద్ మండలం కాళ్లకల్ లో మండల బీఆర్ఎస్ యూత్ వింగ్ అధ్యక్షులు రాహుల్ రెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి, సీఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రేవంత్ రెడ్డికి పరిపాలన సాధ్యం



కాక, కెసిఆర్ ను కేసీఆర్ కుటుంబాన్ని విమర్శించడమే పనిగా పెట్టుకున్నాడు అన్నారు. రేవంత్ రెడ్డి రెండేళ్ల పాలనలో తెలంగాణ ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అనవసరమైన విచారణల పేరుతో కేసీఆర్ను ఇబ్బంది పెడితే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన ఉదృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు మహేశ్వర్, మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు ఇంద్ర సేన యాదవ్, మాజీ ఉప సర్పంచ్ మహేందర్, వార్డు సభ్యులు వర్గాంటి రాజశేఖరరెడ్డి, గుజ్జుల స్వామి, మాజీ వార్డు మెంబర్ వెంకట్ యాదవ్, సీనియర్ నాయకులు మహ్మద్ అజాం, శ్రీధర్ చారీ, నరేందర్ గౌడ్, సెలవుద్దీన్, ఈశ్వరయ్య, బిక్షపతి, రాజు, ముజ్జా, దానయ, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# కాట్రియాలలో సీఎం దిష్టిబొమ్మ దహనం



**రామాయంపేట, ఫిబ్రవరి 01 ( ప్రజా స్వరం ) :**

రామాయంపేట మండలం కాట్రియాల గ్రామంలో మాజీ సీఎం కెసిఆర్ కు సిట్ నోటీసులు ఇవ్వడంతో రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మాజీ సర్పంచ్ శాములు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టి, స్థానిక బస్టాండ్ వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు, ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ శ్యాములు మాట్లాడుతూ నోటీసుల పేరిట ప్రజల దృష్టి మరల్చేందుకే నాటక మాడుతున్నారని, ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి నేడు బీఆర్ఎస్ నాయకులను కార్యకర్తలను బెదిరింపులకు గురిచేస్తూ నోటీసులు అందించడం పద్ధతి కాదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు, ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాబు నాయక్, వార్డు సభ్యులు మల్లారెడ్డి,శ్యామ్ రెడ్డి,బిక్షపతి, సుధాకర్ రెడ్డి, సాయి రెడ్డి, ప్రమోద్, విట్టల్, సత్యపాల్, తదితరులు పాల్గొన్నారు



# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం

* కేసుల పేరుతో కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి: బీఆర్ఎస్ నేతలు

**దౌల్తాబాద్ ఫిబ్రవరి 01(ప్రజాస్వరం):**

దౌల్తాబాద్ మండలం తిర్మలాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ దుబ్బాక ఎమ్మెల్యే, జిల్లా పార్టీ అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి పిలుపు మేరకు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు గడ్డం నాగరాజు, తాజా మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు బండారు దేవేందర్, మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సరుగారి యాదవరెడ్డి మాట్లాడుతూ మాట్లాడారు.తెలంగాణ సాధన కోసం ప్రాణాలను పణంగా పెట్టి ఉద్యమం చేసిన కేసీఆర్‌పై ఎస్సీఐటీ పేరుతో కేసులు పెట్టడం సరికాదని వారు విమర్శించారు. తెలంగాణను దేశంలోనే అభివృద్ధి, సంక్షేమంలో ముందువరుసలో నిలిపిన నాయకుడిపై వేధింపులు చేయడాన్ని తెలంగాణ సమాజం జీర్ణించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న కక్ష సాధింపు చర్యలకు వ్యతిరేకంగా ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు రమేష్‌గౌడ్, నురుడిరాజ నర్సు, దౌల్తాబాద్ వికలాంగుల సంఘం అధ్యక్షుడు శివంది నర్సింలు, వెంకట్, బీరయ్య, నర్సింలు, సత్తయ్య, రామచంద్రం, పండరి, యాదయ్య, అప్రోజ్, కరుణాకర్, రామస్వామి, కిష్టయ్య, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ అరెస్టుకు నిరసనగా బీఆర్ఎస్ శ్రేణుల ధర్నా



**నార్సింగి, ఫిబ్రవరి 01 (ప్రజా స్వరం) :**

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సిట్ నోటీసులు జారీ చేయడాన్ని నిరసిస్తూ మెదక్ జిల్లా నార్సింగి మండల కేంద్రం లో బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన చేపట్టరు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మాజీ జెడ్పిటిసి కిష్టారెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించి, 44వ జాతీయ రహదారి పై ధర్నా నిర్వహించి సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం నుంచి ప్రధాన రహదారి మీదుగా ఎస్బిఐ బ్యాంక్ వరకు పార్టీ శ్రేణులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. అనంతరం రహదారిపై బైఠాయించి పార్టీ కార్యకర్తలతో కలిసి ధర్నా రాస్తా రోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ జాతిపిత కేసీఆర్ అని, రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే నోటీసులు ఇచ్చారని వారు విమర్శించారు. ప్రజల దృష్టి మళ్లించేందుకే సిట్ నోటీసులు ఇవ్వడం జరుగుతుందని ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలను నెరవేర్చకుండా బిఆర్ఎస్ నాయకులను కార్యకర్తలను బెదిరింపుల గురిచేస్తూ ఇలాంటి నోటీసులు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు, మున్సిపల్ ఎన్నికల్లో ప్రజల దృష్టిని మళ్లించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామాలాడుతుందని రాబోయే మున్సిపల్ ఎలక్షన్లో టిఆర్ఎస్ పార్టీ అన్ని మున్సిపాలిటీలో జండా ఎగరవేస్తుందని వారు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కృష్ణారెడ్డి మాజీ ఎంపీపీ సబితా రవీందర్, మాజీ వైస్ ఎంపీపీ సుజాత, వల్లభాపూర్ సర్పంచ్ జగన్ రెడ్డి, బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షులు బాబు, పట్టణ అధ్యక్షులు విష్ణు వర్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు నవీన్, బీఆర్ఎస్ నాయకులు మల్లేశం గౌడ్, గొండ స్వామి యాదవ్, చత్రియ నాయక్, సత్యం, ఓం ప్రకాష్ యాదవ్, నరసింగరావు, రాజు, తదితరులు పాల్గొన్నారు,



# కేసీఆర్‌పై రాజకీయ వేధింపులు ఆపాలి



**ఆదిలాబాద్ జిల్లా ఫిబ్రవరి 01 (ప్రజాస్వరం) :**

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు (కేసీఆర్)పై కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ వేధింపులకు పాల్పడుతోందని ఆరోపిస్తూ ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడా మండలంలో బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడం అంటే తెలంగాణ ఆత్మగౌరవాన్నిఅవమానించడమేనని గులాబీ సైన్యం తీవ్రంగా ఖండించింది.ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో విఫలమై, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక ప్రజల దృష్టిని మళ్లించేందుకే కేసీఆర్‌పై ఉద్దేశ్యపూర్వకంగా రాజకీయ వేధింపులకు దిగుతోందని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. కేసీఆర్‌ను ముట్టుకుంటే రాష్ట్రం అగ్నిగుండంలా మారుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి హెచ్చరించారు.తెలంగాణ ఉద్యమ సారథిగా, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధకుడిగా, తొలి ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించిన నాయకుడు కేసీఆర్ అని, అలాంటి నాయకుడిపై అక్రమ కేసులు, నోటీసులు ఇవ్వడం తగదని పేర్కొన్నారు. ఉద్యమ కాలంలో ఎన్నో కేసులు, నిర్బంధాలను గులాబీ సైన్యం ఎదుర్కొందని, అయినా భయపడేది లేదని స్పష్టం చేశారు. ఎన్ని కేసులు పెట్టినా తెలంగాణ ప్రజల తరఫున పోరాటం కొనసాగుతుందని తెలిపారు.కేసీఆర్‌పై సిట్ విచారణ పేరుతో జరుగుతున్న వేధింపులను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదేశాల మేరకు ఈ ధర్నా కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ గాడ్గే సుభాష్, మాజీ సర్పంచ్ పాండు రంగ్, నార్వడే రమేష్, షాబీర్, మతిన్, గణేష్, ప్రవీణ్, గణపతి తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999